## మాదక ద్రవ్యాలు జీవితాలను సర్వనాశనం చేస్తాయి..!

**- అవగాహన సదస్సులో సెబ్ ఇన్‌స్పెక్టర్ బి.మారుతీరావు**

ఉరవకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సెబ్ ఇన్‌స్పెక్టర్ బి.మారుతీరావు

మాదక ద్రవ్యాలు జీవితాలను సర్వనాశనం చేస్తాయని ప్రతిఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని ఉరవకొండ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.మారుతి రావు అన్నారు. పట్టణం లోని స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బి.మారుతీరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతోపాటు మత్తు పదార్థాలు, గుట్కా, చైనా కేనీ తదితర పొగాకు సంబంధించిన పదార్థాలు నోటి క్యాన్సర్‌ను కలుగుచేసి నరాలను బలహీనపర్చి విచక్షణ జ్ఞానాన్ని కోల్పోయేలా చేస్తాయన్నారు. ఆడపిల్లలు 18 సంవత్సరాలు, మగ పిల్లలు 21 సంవత్సరాలు దాటిన తరువాతే పెళ్ళిళ్లు చేసుకోవాలని బాల్య వివాహాలు అనర్థదాయకం, చట్ట రిత్యా నేరమన్నారు. యువత సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని లాటరీలో లక్షల రూపాయలు గెలుచుకున్నారని, గిఫ్ట్ వస్తుందని లోన్లు ఇస్తామని మీ నంబర్‌కు ఓటీపీ వస్తుందని చెప్పమని ఎవరైనా ఫోన్‌చేసి అడిగినా మేసేజ్‌లు, లింకులు పంపినా స్పందించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ నాగరాజు, జూనియర్ లెక్చరర్ లక్ష్మారెడ్డి, ఐసీడీఎస్ సిబ్బంది రమాదేవి, జీఎంఎస్‌కే అనీత తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

## అంబేద్కర్ బాలికల గురుకులంలో వర్డ్ హంటింగ్ కాంపిటీషన్

ఉరవకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త



వర్డ్ హంటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలోగల డా॥బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు వర్డ్ హంటింగ్ కాంపిటీషన్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రిన్సిపాల్ ఎన్.సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించగా వారు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వారోత్సవాల చివరి రోజు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

## అనుమతి పత్రాలు ఉన్న పురుగుల మందులనే విక్రయించాలి

**- ఏవీ విక్రయించినా రైతులకు రసీదులు తప్పక ఇవ్వాలి**

**- దుకాణాల యజమానులకు సూచించిన ఏడీఏ పద్మజ, ఏవో శుభకర్**

ఉరవకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త



ఎరువులు, పురుగుల మందుల దుకాణ యజమానులకు సూచనలిస్తున్న ఏడీఏ పద్మజ. ఏఓ శుభకర్

వ్యాపార్తిస్థాయి అనుమతి పత్రాలు కలిగివున్న పురుగుల మందులు, ఎరువులనే రైతులకు విక్రయించాలని ఏడీఏ పద్మజ, ఏవో శుభకర్ సూచించారు. శనివారం ఉరవకొండలో మండలంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ, ఏవో మాట్లాడుతూ రైతులకు ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు ఏవి విక్రయించినా వాటిని తగిన రసీదులు తప్పకఇవ్వాల్సి ఉంటుందని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ లో పట్టుబడిన నకిలీ మందుల విషయమై చర్యల నిమిత్తం కోర్టుకు సమర్పించడం జరిగిందన్నారు. నకిలీ పురుగుల మందులు, ఎరువుల విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం విస్తృతంగా నిర్వహించిన తనిఖీల్లో తగిన అనుమతులు లేని కారణంగా పురుగుల మందుల విక్రయాలను నిలిపివేయడం జరిగిందని వారు వివరించారు.

## మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి చేసిన వ్యాఖ్యలు ఆక్షేపనీయం

**- వచ్చే ఎన్నికలోల మేమేంటో చూపిస్తామన్న వడ్డేర్లు**

ఉరవకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న వడ్డేర్లు

వడ్డేర్లు నమ్మదగిన వ్యక్తులు కాదని పుట్టపర్తిలో జరిగిన ఒక సభలో పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బి.కె.పార్థసారథి చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపనీయమని ఉరవకొండ వడ్డేర్లు వాపోయారు. పట్టణంలోని స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంవద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి అందరి మద్దతులో జెడీప చైర్మెన్, ఆపై ఎమ్మెల్యే అయిన పార్థసారథి వడ్డేర్లను కించపర్చేలా మాట్లాడటం సరైంది కాదన్నారు. వడ్డేర్లు పదవుల కోసం పార్థసారథిలా పగటి వేషాలు వేయరని ఆయన గుర్తు పెట్టుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సంఘటితంగా ఏర్పడి మేమేంటో నిరూపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసీపీ మండల సహాయ కార్యదర్శి భీమేష్, కూడేరు సింగిల్‌విండో అధ్యక్షులు గంగాధర్, వడ్డేర్లు లాలుస్వామి, హంపయ్య, మల్లికార్జున, మోహన్, నాగరాజు, వీరన్న, గంగరాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు గాయపడిన ఎలక్ట్రీషియన్‌కు రూ.10వేలు ఆర్థికసాయం

**- అండగా నిలిచిన ప్రైవేటు ఎలక్ట్రికల్, ప్లంబర్ వర్కర్స్ అసోసియేషన్**

ఉరవకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త

ఎలక్ట్రికల్ పనిచేస్తూ కటింగ్ మిషన్‌లో చేయిపెట్టడంవల్ల పట్టణంలోని లాలుస్వామి గుడి ప్రాంతంలో నివశించే ఎలక్ట్రీషియన్ గాజుల సురేష్ ఇటీవల తీవ్రంగా గాయపడగా అతని వైద్య ఖర్చుల కోసం ఉరవకొండ ప్రైవేటు ఎలక్ట్రికల్, ప్లంబర్ వర్కర్స్ అసోసియేషన్ 10,000 రూపాయలు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచింది. శనివారం అసోసియేషన్ బాధ్యులు బాధితుడు గాజుల సురేష్ ఇంటింటి వెళ్లి ఆర్థిక సాయం అందించి ఆందోళన వద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు యం.నజీర్, ఉపాధ్యక్షులు యం.శివప్రసాద్, కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శి బి.బాలక్రిష్ణ, కోశాధికారి ఎస్.ఖాసీంవలి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ధర్మప్రచార వారోత్సవాలకు విచ్చేయండి

**- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికు ఆహ్వానం**

ఉరవకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త



మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికు ఆహ్వాన పత్రిక అందిస్తున్న దృశ్యం

ఈనెల 19వ తేదీ నుండి 25 వరకు హిందూ దేవాదాయ ధర్మాదాయశాఖ ఆదేశాల మేరకు పెన్నహోబిళం లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార వారోత్సవాలకు విచ్చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వ రరెడ్డిను ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ ఆహ్వానించారు. శనివారం జిల్లా కేంద్రం అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి సత్కరించి ధర్మప్రచార వారోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. రాష్ట్ర ప్రజల సౌభాగ్యం, సనాతన ధర్మ ప్రచారం, ఆలయ సంస్కృతి, సంప్రదాయాల వ్యాప్తి కోసం దేవాదాయశాఖ ధర్మప్రచార పరిషత్‌ను ఏర్పాటు చేసి తద్వారా సామాజిక శ్రేయస్సు కోసం ప్రతిష్టాత్మకంగా ధర్మప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోందని వారు మాజీ ఎమ్మెల్యేకు వివరించారు.

## గ్రంథాలయాలు సమాచార కేంద్రాలు..!

**- ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి**

**- కొనసాగిన 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు**

ఉరవకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి

గ్రంథాలయాలు సమాచార కేంద్రాలని వాటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణ జ్యోతి అన్నారు.



మాట్లాడుతున్న లైబ్రేరియన్ వై.ప్రతాపరెడ్డి

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఐదవ రోజు గ్రంథాలయాల ఆవశ్యకతపై డిగ్రీ కళాశాల విద్యార్థులకు గ్రంథాలయ అధికారి వై.ప్రతాపరెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు జరుగగా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కె.అరుణజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు గ్రూప్-2, ఐఏఎస్, ఐపీఎస్ ఇతరత్రా పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గ్రంథాలయంలో అందుబాటులో ఉండే మెటీరియల్‌ను వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి వై. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన లేటెస్టు గ్రూప్-1,2 ఇతరత్రా పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కామర్స్ లెక్చరర్ అల్తాఫ్ పాల్గొన్నారు.

## మందకృష్ణను కలిసిన దళిత పాత్రికేయులు

గుడిబండ, నవంబర్ 18 ప్రభాతవార్త



లమంద కృష్ణతో దళిత పాత్రికేయులు

ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను గుడిబండ మండలంలోని దళిత పాత్రికేయులు బిహెచ్ రాయుడు, కొంకల్లు శివన్న శనివారం హైదరాబాద్‌లో మార్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 11న మాదిగల విశ్వరూప మహాసభ అనంతరం శనివారం సికింద్రాబాద్‌లోని గార్డెన్‌లో జరిగే తొలి జాతీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నామని సీనియర్ పాత్రికేయులు తిమ్మలాపురం బిహెచ్‌రాయుడు, కొంకల్లు శివన్నలు తెలిపారు. అలాగే మందకృష్ణ మాదిగను వీరిరువును ప్రత్యేకంగా కలిసి పలు విషయాలపై చర్చించి, ఎస్సీ వర్గీకరణ కోసం చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశానికి మంద కృష్ణ మాదిగతోపాటు కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

## రోడ్ల పరిస్థితిపై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- జనసేన మండల అధ్యక్షులు మంజునాథ్**

గుడిబండ, నవంబర్ 18 ప్రభాతవార్త



జనసేన మండల అధ్యక్షులు మంజునాథ్

తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో మడకశిర పట్టణంలో జరిగే రోడ్ల పరిస్థితిపై నిరసన కార్యర్కమాన్ని విజయవంతం చేయాలని గుడిబండ జనసేన మండల అధ్యక్షులు మంజునాథ్ తెలుగు దేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైందని కావున రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కనువిప్పు కలిగేలా నేడు ఆదివారం ఉదయం 9 గంటలకు తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి మడకశిర పట్టణంలోని మధుగిరి రోడ్డులోని గుంతల రోడ్లను పరిశీలించి నిరసన కార్యక్రమం చేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో మండకశిర తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి పాల్గొంటారని కావున తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మధుగిరి రోడ్డులోని మారుతి నగర్ వద్ద గల పంచముఖ ఆంజినేయస్వామి దేవస్థానం వద్దకు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## కాంగ్రెస్ ముందడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- మండల అధ్యక్షులు నాగరాజు**

గుడిబండ, నవంబర్ 18 ప్రభాతవార్త



కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగరాజు

మండలంలో నేడు ఆదివారం జరితగే ప్రజాఆశీస్సులుకోసం కాంగ్రెస్ ముందడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్‌పార్టీ మండలఅధ్యక్షులు నాగరాజు ప్రజలనుకోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ముత్తుకూరు, గుణేమోరబాగలు గ్రామ పంచాయితీలలోని మద్దనకుంట, కురుబర పల్లి, వ్రదహట్టి, మందలపల్లితాండ, ముత్తుకూరు, ఉప్పరపల్లి, ఇటికేపల్లి, మీదుగా గుణే మోరబాగల్, హుస్సేన్ పురం, ఆచార్యపాళ్యం గ్రామాల్లో ప్రజా ఆశీస్సులు కోరుతూ కాంగ్రెస్ పార్టీ ముందడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొంటారని తెలిపారు. కావున మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరి నిర్వహిస్తున్న దృశ్యం



సత్యసాయి బాబా చిత్రపటాలు అందిస్తున్న దృశ్యం

పుట్టపర్తిరూరల్, నవంబర్ 18, ప్రభాతవార్త

భగవాన్ సత్యసాయి జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో విద్యార్థులు వేదపఠనంతో సంగీత కచేరీ ప్రారంభమైంది. మాన్య ఆరోరా బృందం నిర్వహించిన ఈ సంగీత కచేరి భక్తులను అలరించింది. ప్రత్యేకించి వేణునాదంతో ఆలపించిన సాయిగీతాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ సందర్భంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వారు మాన్యఆరోరా బృందం వారిని సత్యసాయి చిత్రపటాలు, ప్రసాదాలు అందించి సత్కరించారు. అనంతరం విద్యార్థుల భజన కార్యక్రమంతో వేడుకలు ముగిశాయి.





సత్యసాయి మహాసమాధివద్ద ఆశీస్సులు అందుకుంటున్న మాన్యఆరోర బృందసభ్యులు

## దిశచట్టం, మహిళా సాధికారతపై అవగాహన

కొత్తచెరువు, నవంబర్ 18, ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల నందు విద్యార్థులకు దిశచట్టం, మహిళా సాధికారతపై అవగాహనకల్పించారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను గ్రంథాలయ అధికారి జయరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఉపాధ్యాయనీలు అనంతలక్ష్మి, సుకన్యలు మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక దాడులు అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ కేసుల్లో 14 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో ప్రావీణ్యం సాధించిన విద్యార్థులకు ముగింపురోజున బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యపకులు నజీర్‌బాషా, రాముడు, ఉపాధ్యాయనీలు భాగ్యలక్ష్మి, రాధలక్ష్మి, సాయిసుశీల, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలలో చిత్ర లేఖనం

రామగిరి, నవంబర్ 18 ప్రభాతవార్త



చిత్రలేఖనం నిర్వహిస్తున్న దృశ్యం

56 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రామగిరి శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థుల కళానైపుణ్యం, సృజనాత్మకత పెంపొందించడానికి స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాల, జడ్పి హై స్కూల్ ఏపి మోడల్ స్కూల్‌లో జూనియర్స్‌కు మీకు నచ్చిన చిత్ర పటం, సీనియర్స్‌కు స్వచ్ఛభారత్ అను అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. చిత్రలేఖనం ఊహకు రూపాన్ని ఇచ్చే చక్కటి సాధనం అని, పిల్లల్లో ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, మనసుకు ఆనందాన్ని ఇచ్చే ఒక కళ అని, పాఠశాలలో నేర్చుకునే సాధనంగా డ్రాయింగును తప్పనిసరిగా ఉపయోగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేష్, హై స్కూల్ కెజిబివి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, రామాంజినేయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బళ్లారి సిటీ నూతన డీయస్పీగా చంద్రకాంత్‌నందరెడ్డి



బళ్లారి సిటీ నూతన డీయస్పీగా చంద్రకాంత్‌నందరెడ్డి

బళ్లారి, నవంబర్18, ప్రభాతవార్త;

బళ్లారి సిటీ నూతన డీయస్పీగా చంద్రకాంత్‌నందరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. శుక్రవారంనాడు రాష్ట్ర ప్రభుత్వం పోలీసు ఉన్నతాధికారుల బదిలీల ఆదేశం జారీ చేసిన నేపథ్యంలో చంద్రకాంత్‌నందరెడ్డిని బళ్లారి సిటీ డీయస్పీగా బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సీపీఐగా రాష్ట్రంలో వివిధ చోట్ల బాధ్యతలు నిర్వహించిన చంద్రకాంత్ డీయస్పీగా పదోన్నతి పొంది విజయపుర తదితర జిల్లాల్లో సేవలందించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 44 మంది డీయస్పీల బదిలీ చేస్తూ పోలీసు డీజీపీ పరంగా ఐపీఎస్ అధికారి సోమేందుచటర్జీ ఆదేశాలు జారీ చేశారు.

## భారత్-ఆస్ట్రేలియా ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో టీం ఇండియా జయభేరి ఖాయం.....

**- రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి బి.నాగేంద్ర శుభాశీస్సులు**

బళ్లారి, నవంబర్18, ప్రభాతవార్త;



రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి బి.నాగేంద్ర

భారత్-ఆస్ట్రేలియా నడుమ ఆదివారంనాడు అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ అద్భుతమైన విజయంతో వరల్డ్ కప్‌ను సాధించి తీరుతుందని రాష్ట్ర యువజనసేవలు, క్రీడాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి బి.నాగేంద్ర అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో టీం ఇండియా వరల్డ్‌కప్ లీగ్ మ్యాచ్‌లలో ఆడిన 9 మ్యాచ్‌లలో ఓటమి లేకుండా విజయం సాధిస్తూ వచ్చింది. సెమీ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై ఆడి గెలుపు సాధించి అత్యుత్తమ ఆట తీరు ప్రదర్శన కనబరిచి కోట్లాది భారతీయులను, క్రీడాభిమానులను ఉత్సాహపరిచిందని పేర్కొన్నారు. ఓటమి ఎరుగని టీం ఇండియా ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లోనూ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి విజయం సాధించి ప్రపంచకప్‌ను భారతీయులకు కానుకగా అందజేస్తారని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో భారత కీర్తి పతాకాన్ని ఎగురవేసి దేశానికి పేరు, ప్రతిష్టలు తీసుకొస్తారని కెప్టెన్ రోహిత్‌శర్మ నేతృత్వంలోని టీం ఇండియా అద్భుతమైన ఫాంలో ఉన్నదని తెలిపిన ఆయన, దేశవ్యాప్తంగా పండగ వాతావరణం కనిపిస్తున్నదని క్రీడాభిమానుల్ని, ప్రజల్ని సంబరాల్లో మునిగిపోయే తరుణం మరికొన్ని గంటల్లో ఆసన్నమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# తెలుగుదేశం ఆరిపోయే దీపం

**- ఆరిపోయే దీపం కోసం పరిటాల సునీత ఆరాటం**

**- బెస్త కార్పోరేషన్ డైరెక్టర్ కెవి.రమణ ధ్వజం**

అనంతపురం, నవంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో

కోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని జగన్‌తోనే పోల్చడం అంటే ఆ నియోజకవర్గ అభివృద్ధిని టిడిపి నాయకురాలు సునితమ్మ అంగీకరించినట్లే అని బెస్త కార్పోరేషన్ డైరెక్టర్ కెవి.రమణ ధ్వజమెత్తారు. సైకో అనే పదం టిడిపి వారికి అలవాటుగా మారింది. చదువు రాని సునితమ్మ కూడా సైకో అంటున్నది. సైకోకు స్పెల్లింగ్ అర్థము సునితమ్మకు త ఎలుసా మీరు సైకో అంటుంటే తోపుదుర్తి నియోజకవర్గ ప్రజలు ప్రకాష్‌రెడ్డి, ప్రజలకుచేస్తున్న కోఆపరేషన్‌కు సైఅని అన్నట్లుంది. మీరు కూడా పరోక్షంగా అదే అంటున్నారని ప్రజలు భవిస్తున్నారు అని ఆయన అభిప్రాయపడ్డారు. టిడిపిమేనిఫెస్టోకి భయపడటమా.. నిజమే మీదిమేనిఫెస్టో కాదు ప్రజలకు స్ట్రోక్ అందుకే మీ మేనిఫెస్టోకి ప్రజలు భయభ్రాంతులై 2019 ఎ న్నికల్లో మిమ్ములను శంకరగిరి మాన్యాలు పట్టించారు. టిడిపి మేనిఫెస్టో అంటే ఒక వంచన, మోసం, అబద్దాల పుట్ట అని ప్రజలు ఏనాడో తేల్చేశారు అని ఆయన ధ్వజమెత్తారు. ఆ విధంగా మీ మేనిఫెస్టోకి రాప్తాడు నియోజకవర్గ ప్రజలు మరల అలాంటి మేనిఫెస్టో తీసుకొస్తారేమో అని భయపడుతున్న మాటనిజమే. వైఎస్ఆర్‌సిపి మేనిఫెస్టో అంటే నమ్మకం, అది ప్రజల ఆశ, శ్వాస, 2014 టిడిపి మేనిఫెస్టో ఎక్కడ దాచారో చూపగలరా..? ఎందుకు వెబ్‌సైట్‌నుంచితొలగించారో చెప్పగలరా..? అని ప్రశ్నించారు. ఒక్కసారి ఎమ్మెల్యేను చేసిన ఫలితంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి న ఇరంతరం ప్రజలకు కాపలాదారుడుగా పనిచేస్తున్నారు. ఏ కుటుంబంలో ఎవరు చనిపోయిన ఆ కుటుంబానికి బాసటగా నిలబడుతున్న ఏకైక వ్యక్తి ప్రకాష్‌రెడ్డిగా మీకు కనబడలేదా..? నిత్యం ప్రజల రక్తమాంసాలను భుజించిన మీరెక్కడ..? అనునిత్యం ప్రజలేధ్యాస,శ్వాసగా బతుకుతున్న ప్రకాష్ ఎక్కడ..? ఆయన వివరించారు. ఆంధ్రరాష్ట్రంలో అతి చిన్న వయస్కుడిగా, గొప్ప ఆలోచనలు కలిగిన వాడిగా అనతి కాలములోనే పేరు తెచ్చుకొని, రాష్ట్రంలో ఏప్రాంతంలో ఏరకమైన ఎన్నికలుజరిగినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకస్తునిగా ప్రకాష్‌ను ఆ ప్రాంత బాధ్యతలు ఇవ్వడంబట్టి అతని శక్తిఏమిటో మీకు కనపడలేదా..? మీ కంట సోషకాలకు, మీ పిల్లి శాపాలకు ఎవరు కనికరించరు. మీరు నిత్యం అసత్యాల ప్రచారం తప్ప, ఎక్కడైనా సామాన్యమానవునికి సాయంచేసిన దాఖలాలు చూపించగలరా..? చరిత్రలో కనివిని ఎరుగని విధంగా, ఏ నాయకుడు, ఏ పార్టీ చెప్పని విధంగా, జగన్ ప్రనజలకు మేలు చేసి ఉంటే నా పార్టీకి ఓటేయండి అని పబ్లిక్‌లో చెప్పగలిగిన సన్నివేశం ఎక్కడైనా చూశారా..? ఆ దమ్ము దైర్యం మీ పార్టీకి మీకు ఉన్నదా..? అని ప్రశ్నించారు. మీ పార్టీ మరో నాయకుడు బాలకృష్ణ పండితుని కడుపులో పుట్టిన సుంత, ఈ జిల్లా ప్రజలు అతనిలో ఎన్టీఆర్‌ను చూసుకొని, ప్రతిసారి హిందూపురం వాసులు విజయాన్ని చేకూర్చి పెడుతున్నారు. అయినా బాలకృష్ణ, హిందూపురానికి చుట్టపు చూపుగా వస్తున్నాడే కానీ ఆ నియోజకవర్గ శాసనసభ్యుడిగా, వారి తండ్రి ఎన్టీఆర్ కాలంలో జరిగిన అభివృద్ధితప్ప, బాలకృష్ణఅభివృద్ధిని కాంచించాడా..? కాంచించకపోగా, నేడు నాది, పవన్ కళ్యాణ్‌ది ఒకే మనస్తత్వమని మాట్లాడటం దేనిని సూచిస్తుంది..? అంటే ఇద్దరిదీ నిలకడ లేని మనస్తత్వమనే కదా..? పవన్ కళ్యాణ్ ముగ్గురు ఆడపడుచలను బోల్తా కొట్టించినట్లు, 2014లో కమ్యునిస్టులతో కలిసి నేనే నిజమైన కమ్యునిస్టు చెగువీరా అని కమ్యునిస్టులను బోల్తా కొట్టించాడు. ఓడిపోగానే కమ్యునిస్టు సిద్దాంతాలకు బద్ధ వ్యతిరేకమైన, బిజెపితో కలిసి నేను చేగువీరను కాదు సావార్కర్ అని నిరూపించుకున్నాడు. అలాంటి వాడితో పోల్చుకోవడం ఎన్టీఆర్ కడుపులో పుట్టిన బాలకృష్ణకు సిగ్గుగాలేదా..? మీపార్టీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు జైలుకు పోగానే జరిగిన సమావేశంలో అతని సీట్‌లో కూర్చోవచ్చా..? లేదా..? అన్న జ్ఞానం కూడా లేని ఇలాంటి వారు, వేలు మిరిగితే సున్నం పెట్టని మీ లాంటి వారు, క్రికెట్ ప్రపంచ కప్‌లో ఇండియా టీంలా దూసుకుపోతున్న ప్రకాష్‌రెడ్డిని ఓడించడం మీ తరమా..? అని బెస్త కార్పోరేషన్ డైరెక్టర్ కెవి.రమణ ప్రశ్నించారు.

## విద్యార్థులకు సాహిత్య, క్రీడా పోటీలు

లేపాక్షి, నవంబర్ 18 ప్రభాతవార్త



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి మండల కేంద్రంలోని గ్రంథాలయం అధికారం జయసింహారాజు ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి పోటీలను నిర్వహించడం వల్ల వారిలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. పలు అంశాల్లో విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు. పాఠశాల దశలోనే పోటీ తత్వం పెంచేందుకు జిల్లా గ్రంథాలయశాఖ నిర్వహించిన పోటీలు విద్యార్థులకు బాగా ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నికృష్ణ, సుజాత, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నర్సాపురంలో గొర్రెలకు, మేకలకు వైద్య శిభిరం

బెలుగుప్ప, నవంబర్ 18 ప్రభాతవార్త



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో గొర్రెలకు మేకలకు వైద్య శిభిరం ఏర్పాటు చేసినట్లు పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. నియోన వ్యాధితో బాధపడుతున్న గొర్రెలకు, మేకలకు కాసే రైతులకు ఉచిత సలహాలు సూచనలు తెలియజేశారు. అందులో భాగంగా ఆ గొర్రెలకు, మేకలకు యాంటి బయోటిక్, ఉచిత మందులను, సిరంజిలను అందరికి అందజేశారు. గొర్రెలు, మేకల కాపర్లకు హెల్త్ కార్డులు కూడా పంపిణీ చేశారు. అనంతరం శ్రీరంగపురం గ్రామంలో కూడా విజ్ఞాన బడి బాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపర్లు, మేకల కాపర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ వారోత్సవాల్లో వ్యాసరచన పోటీలు

బెలుగుప్ప, నవంబర్ 18 ప్రభాతవార్త

మండల కేంద్రంలో 56వ జాతీయ గ్రంథా లయ వారోత్సవాల్లో భాగంగా శనివారం సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గ్రంథ్రాలయ అధికారి ప్రతాప్‌రెడ్డి, సన్‌రైజ ర్స్ స్కూల్ కరస్పాం డెంట్ మారెన్న ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు, వక్తృత్వపు పోటీలు, క్రీడా పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా ఈ వారో త్సవాలు చివరి భాగంలో గెలిచిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

# కనీసం రహదారుల్లో ఏర్పడిన గుంతలనైనా పూడ్చండి

**- 'గుంతల ఆంధ్ర ప్రదేశ్‌కు దారేది' కార్యక్రమంలో టిడిపి-జనసేన నాయకులు**

ధర్మవరం టౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త


రోడ్లలో ఏర్పడిన గుంతలను పరిశీలిస్తున్న చిలకం మధుసూధనరెడ్డి

రాష్ట్రంలో రోడ్లను అభివృద్ధి చేయలేకపోయినా కనీసం ప్రధాన రహదారుల్లో ఏర్పడిన గుంతలనైనా పూడ్చాలని టిడిపి-జనసేన పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనసేన-టిడిపి పార్టీల ఉమ్మడి సారధ్యంలో రూపొందించిన గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది అన్న కార్యక్రమాన్ని శనివారం పట్టణ శివారులోని ప్రధాన రహదారిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద రహదారిలో ఏర్పడిన గుంతలను వారు పరిశీలించారు. లోతైన గుంతలతో ప్రయాణం దుర్భరంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. అనంతపురం - చెన్నై జాతీయ రహదారికి ధర్మవరం నుండి వెళ్ళే లింకురోడ్డులో లోతైన గుంతలు ఏర్పడడం వారు గమనించారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూధనరెడ్డి ఆధ్వర్యంలో ధర్మవరం-అప్పరాచ్చెరువు, ధర్మవరం- ముష్టూరు రోడ్ల దుస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను ఆపి రోడ్ల దుస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్లను నిర్మించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాపోయారు. గుంతల రోడ్లలో వాహనాలను నడిపేందుకు డ్రైవర్లు పలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాగరికతకు చిహ్నమైన రహదారులను అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాలలో ప్రధాని ఫోటో ఉంచాలి

**- ఆర్‌డిఓకు వినతిపత్రం ఇచ్చిన బిజెవైఎం**

ధర్మవరం టౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త


వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాలలో దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఫోటోను ఉంచాలని బిజెవైఎం డిమాండ్ చేసింది. రాష్ట్ర బిజెవైఎం అధ్యక్షుడు వంశీకృష్ణ పిలుపుమేరకు శనివారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో స్థానిక నాయకులు వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు రవితేజా రెడ్డి మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా బియ్యం ఇస్తున్నప్పటికీ రేషన్ దుకాణాలలో ప్రధాని ఫోటోలేకపోవడం విడ్డూరమన్నారు. అయితే రేషన్ దుకాణాలలో రాష్ట్ర ప్రభుత్వ స్టిక్కర్ వేసుకుని కేంద్రప్రభుత్వ పథకాన్ని మరుగున పడేశారని ఆయన వాపోయారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఈ ఉచిత బియ్యం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తమ పథకంగా చెప్పుకుంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 1వ తేదీలోపల ప్రధాని ఫోటోను ఏర్పాటు చేయకపోతే డిసెంబర్ 2న తామె ప్రధాని ఫోటోను రేషన్ దుకాణాలతో పాటు రేషన్ సరఫరా వాహనాలకు వేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు డిష్ రాజు, గొట్లూరు చంద్ర, నారాయణస్వామి యాదవ్, రాప్తాటి రాము, దుస్సా కృష్ణా, నబీ రసూల్, గంధమనేని నారాయణస్వామి, గిరిధర్, సరితాల దస్తగిరి, హరికృష్ణ, చింతా జగదీష్, శ్రీనివాసులు, తిరుమలేసు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల దుస్థితిపై టీడీపీ-జనసేన ఉమ్మడి నిరసన..!

**- ఉరవకొండ-చాబాల రోడ్డు హంద్రీనీవా వంతెనపై ఆందోళన**


రోడ్డును పరిశీలించిన నిరసన తెలుపుతున్న టీడీపీ-జనసేన నాయకులు

ఉరవకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త

రోడ్ల దుస్థితిపై తెలుగుదేశం- జనసేన పార్టీలు శనివారం ఉమ్మడి నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఉరవకొండ నుండి చాబాల, ధర్మపురి, పొలికి గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డులో హంద్రీనీవా కాలువపై సంవత్సరాలు గడిచిపోతున్నా ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ అక్కడ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ రహదారి అధ్వాన్నంగా ఉండటం, వంతెన నిర్మించకపోవడంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో రాకపోకలు నిలిచిపోవడమే కాకుండా ప్రతినిత్యం ఎందరో ప్రమాదాలకు గురై గాయపడుతున్నారన్నారు. రోడ్డు దుస్థితి, వంతెన ఆవశ్యకతను ఎన్నో సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నేటికీ స్పందన లేదన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటం తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు గురించి పట్టడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, చాబాల మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి, నాయకులు లింగమూర్తి, రాంబాబు, మూర్తి, ఎల్లప్ప, జంగల్‌సాబ్, పవన్, గోవిందు, జనసేన నాయకులు దేవేంద్ర, భార్గవ్, వన్నూరుస్వామి, బద్రీ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవారి పల్లకీ ఉత్సవం

ఉరవకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త


శ్రీవారి పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న ఎంపీపీ యం.నరసింహులు, ఆలయ మాజీ ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం కార్తీక పంచమి శనివారం సాయంత్రం శ్రీవారి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కొలువుదీర్చిన ప్రధానాలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించగా నూతన ఎంపీపీ యం.నరసింహులు, ఆలయ మాజీ ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్ అంతకు ముందు ప్రధానాలయంలో ఆమె లక్ష్మీనరసింహస్వామిను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాకారోత్సవంలో జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాల గుండా కాలువలో పారుతున్న నీటి జలపాతాలవద్ద ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది దీపక్, మారుతి అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

# 20న సర్వ సభ్య సమావేశం

**అగళి, నవంబర్ 18 ప్రభాతవార్త :** ఈనెల 20వ తేది సోమవారం 9:30 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ రవిప్రసాద్, ఏఓ శ్రీనివాసరావు తెలిపారు. మండల సర్వసభ్య సమావేశంలో మండలంలో ఉన్న సమస్యలపై సర్పంచులు, ఎంపిటిసిలు ప్రశ్నలు సమాధానాలు చెప్పుకోవచ్చని, అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరవుతారని తెలిపారు. మండలంలో ఎంపిపి, జడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరు కావాలని కోరారు.

# ఘనంగా అఖిల భారత సహకార వారోత్సవాలు

పెనుకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త


మాట్లాడుతున్న అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి

ఇస్లాంపురం సహకార సంఘం సొసైటీలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను శనివారం సొసైటీ అధ్యక్షులు సల్లా సూర్య ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. బ్యాంకు ఆవరణంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు మాట్లాడుతూ.. నూతన సవరణలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రైవేట్ రంగాలకు దీటుగా సహకార సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్క ఉద్యోగి కృషి చేయాలన్నారు. సంస్థ దినదిన అభివృద్ధితోపాటు ప్రజలకు సహకారం అందించే దిశగా పని చేయాలని సూచించారు. 70 వసంతాల సుదీర్ఘంగా ప్రజలకు సహకార సంఘం సహకారాన్ని అందిస్తోందన్నారు. ఎందరో మేధావుల కృషి నేడు సహకార సంఘాల మూల స్తంభాలని అభివర్ణించారు. పెనుకొండ సబ్ డివిజన్ సహకార ఆడిటర్ ఇన్స్‌పెక్టర్ రవి మాట్లాడుతూ.. రైతు పరస్పర సహకార పరపతి సంఘం అన్నింటిలోనూ ముందంజలో ఉందని, రైతులు పండించిన రాగులు, వేరుశనగ, కందులు మొదలగు పంటలను రైతు సహకార పరపతి సంఘం ద్వారానే కొనుగోలు చేసి రైతులకు చేదోడుగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు మేనేజర్ నాగభూషణం, బ్యాంకు సూపర్‌వైజర్ నితిన్ విశ్వనాథ్, అసిస్టెంట్ మేనేజర్ రంగ లక్ష్మిమ్మ, బ్యాంకు సిబ్బంది హాలీంబాషా, పిఎసియస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ సొసైటీ సిబ్బంది రామమోహన్, నాగార్జున, నరసింహ, సొసైటీ రైతులు పాల్గొన్నారు.

# శేషంపల్లిలో లీగల్ క్యాంపు


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రామగిరి, నవంబర్ 18 ప్రభాతవార్త

టింబక్టు కలెక్టివ్ సహకారంతో ప్రతిభా సొసైటీ ఆధ్వర్యంలో శేషంపల్లి గ్రామంలో లీగల్ క్యాంపును నిర్వహించగా 35 మంది వికలాంగులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. ఈ సదస్సులో వేలనరికపు వివాహాలు, స్త్రీలను చిన్నచూపు చూడటం జరిగింది. అలాగే వికలాంగుల చట్టాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఇందులో ప్రతిభా సొసైటీ సిఇఓ నరసింహులు, ప్రతిభ కోఆర్డినేటర్ జయశ్రీ, డైరెక్టర్స్ అలాగే అధ్యక్షులు కె.నాగరాజు అలాగే టీం సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా కనిమే మారెమ్మ దేవి నూతన విగ్రహ ప్రతిష్టాపన


అమ్మవారి ప్రతిష్టాపన దృశ్యం

**అమరాపురం, నవంబర్ 18, ప్రభాతవార్త:** మండలపరిధిలో మద్దన కుంటగ్రామంనందు శ్రీకనిమే మారెమ్మ దేవి దేవాలయంనందు నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం మరియు గోపర ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం వేద పండితులు శాస్త్రోక్తంగా వేద మంత్రోచరణల మధ్య చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం తెల్లవారుజామునే కళసారాధన, ప్రాణ ప్రతిష్టాపన, నవగ్రహ, గణపతి హోమాలను కనివేమారెమ్మదేవి హోమం, ప్రతిష్టాంగ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించి అమ్మ వారి నూతన విగ్రహంను ప్రతిష్టాపన గావించారు. ఈ సందర్భంగా అమ్మవారి నూతన విగ్రహానికి పూలతో అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నూతన దేవాలయానికి భక్తులు, నిర్వహకుల సమక్షంలో భక్తిశ్రద్దలతో గోపుర కళశ స్థాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్దలతో ప్రతి ఇంటి నుండి మహిళలు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు సురేష్ శాస్రి ఆధ్వర్యంలో హులియూరు వంశస్థులు, మద్దనకుంట గ్రామప్రజలు భక్తాదులఆధ్వర్యంలో దేవతాకార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం విచ్చేసినభక్తులకు అన్నదానకార్యక్రమాన్ని నిర్వహించారు.

# సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారు.. సిబ్బంది సమస్యను మరిచారు

అగళి, నవంబర్ 18 ప్రభాతవార్త

ప్రజల వద్దకే పాలన.. ప్రజలకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశ్యంతో జగన్ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. మండలంలో 13పంచాయితీలు ఉండగాఅక్కడ ఒక్కో సచివాలయానికి, సచివాలయభవనంతోపాటు వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బికెలను మంజూరు చేసింది. అగళిపంచాయితీలో సచివాలయం అర్థాంతరంగా నిలిచిపోయింది. వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం కాలేదు. భరోసా కేంద్రానికి భరోసా లే దు. ఇలా మండలంలో అనేక పంచాయితీల్లో భవన నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదు. భవన నిర్మాణాల సంగతి అటుంచితే అందులో పని చేసే సిబ్బంది సమస్య మెండుగా ఉంది. పదుల సంఖ్యలో సచివాలయ సిబ్బంది కొరతగా ఉండటం మ ఊలంగా ప్రజల సమస్యలు ఎక్కడికక్కడ పనులు చేసేవారు లేక నిలిచిపోతున్నాయి. సచివాలయం అంటే పంచాయితీ కార్యదర్శితోపాటు విఆర్‌ఓ వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, సర్వేయర్ మహిళా పోలీస్ ఇలా దాదాపు 12పోస్టులు ఒక్కో సచివాలయానికి సిబ్బంది అవసరం ఉంది. మండలం మొత్తానికి ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు. వెల్ఫేర్ అసిసెంట్లు ఉన్నారు. అల్లికెర లాంటి చోట ఒకరిద్దరితో నెట్టుకురావాల్సిన పరిస్థితి. రెవెన్యూ సమస్యలైనా భూ సమస్యలైనా సర్వే సమస్యలైనా జనన, మరణ ధృవీకరణ పత్రాలైనా ఇలాసర్టిఫికెట్లను అందజేసేవారు సైతం కరువయ్యారు. సచివాలయంలోనే అన్నిపనులు సక్రమంగా జరుగుతాయని అధికారులు అంటున్నారు కానీ సచివాలయంలో సిబ్బంది ఉంటే కదా ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేది, 10 మంది పని చేసే చోట ఒక్కరో ఇద్దరో ఉ ంటే వివిధ రకాల పనులను ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. దాదాపు 60 నుంచి 70 పోస్టులు మండలంలోనే ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను భర్తీ చేస్తేనే ప్రజల పనులు సులభంగా జరుగుతాయి. అందుకే సంబంధిత అధికారనులు చొరవ తీసుకుని సచివాలయాల్లో ఉ న్న ఖాళీలను భర్తీ చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సచివాలయ ఖాళీలను భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# డిల్లీలో జరిగే జాతీయస్థాయి కుస్తీ పోటీలకు రోహిత్ కుమార్ ఎంపిక


ఎంపికైన విద్యార్థి

**గోరంట్ల, నవంబర్ 18, ప్రభాతవార్త:** మండలంలోని కోండాపురం పంచియతీ పరిధిలోని చింతమానపల్లి గ్రామానికి చెందిన వడ్డే ప్రకాష్ కుమారుడు రోహిత్ కుమార్ జాతీయ స్థాయిలో కకుస్తి పోటీలకు ఎంపికయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు చింతమానుపల్లి గ్రామంలో వడ్డే ప్రకాష్, అరుణ దంపతులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ తమ కుమారుడు రోహిత్ కుమార్ పెన్నోబిలం కొనకొండ్ల ఏపిఆర్ఎస్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అక్కడి వ్యాయామ ఉపాధ్యాయుడు దాసరి నరసింహులు రోహిత్ ఉన్నటు వంటి ప్రతిభగుర్తించి కుస్తీలో మెలకువలు నేర్పించాడు. గతంలో విజయవాడలో నున్నా స్టేడియంలో, తిరుపతి రేణిగుంట స్టేడియంలో, అనంతనురం ఆర్డీటీస్టేడియంలో కుస్తీపోటిలలో పాల్గొన్నట్లు, రెండు సంవత్సరాల కష్ట పలితంగా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించి న్యూడిల్లీలో జరిగే జాతీయ స్థాయిలో పాల్గొంటున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహులు తెలిపారు. విద్యార్థి రోహిత్ కుమార్ మాట్లాడుతూ దీనంతటికి మా తల్లిదండ్రులు వడ్డే ప్రకాష్, అరుణ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహులు తనని ఎంతగానో ప్రోత్సహించడం వల్ల జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో రాణించడం జరిగిందని, వారి ప్రోత్సహం వల్ల జాతీయ స్థాయిలో కూడా పథకం సాధించి తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకోస్తానని తెలియజేశాడు. క్రీడా కోటాలో ఉద్యోగం సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశాడు. నన్ను ప్రోత్సహించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోండి

**అమరాపురం, నవంబర్ 18, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అమరాపురం ఉన్నత పాఠశాల యందు గ్రంథాలయ 56 వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఇబ్రహీం, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయంలో ఉపయోగపడే పుస్తకాలపై వివరించడంతో పాటు పోటీ పరీక్షలకు అందే పుస్తక సామాగ్రి గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీ పరిక్షలను నిర్వహిస్తున్నట్లు ఆమన పేర్కొన్నారు. ఈ కార్యమ్రంలో గ్రంథాలయ సిబ్బంది, గౌడనకుంట వీరకేతరాయ, శివరం మారెన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వణికే ఓయవ్వ జయంతోత్సవాలను విజయవంతం చేయండి

**- మాల మహానాడు నాయకులు**

అమరాపురం, నవంబర్ 18, ప్రభాతవార్త:


ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న దృశ్యం

ఈ నెల 23వ తేదిన మడకశిరలో నిర్వహించే వీర వనిత వణికే ఓబవ్వ జయంతి ఉత్సవాలను మాల సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని మాల మహానాడు సంఘం అధ్యక్షుడు పాండురంగమూర్తి, కాచికుంట వెంకటేష్, కార్యదర్శి సోము కుమార్, జైరామప్ప, మాల సోమన్న, రాజశేఖర్‌లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మాల సోదర సోదరీమణులు ఉన్న ప్రతి గ్రామంలోను తిరిగి ఆహ్వాన పత్రికలను అందజేసినట్లు వారు తెలిపారు. విజయనగర సామ్రాజ్యంలో వీర వనిత వణికే ఓబవ్వ మదకరి నాయకుల రాజ్యాన్ని కాపాడిన వీరమణి అని అమే యేక్క జయంతి ఉత్సవాలను మడకశిర నందు భారీ ర్యాలీతో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జ్ఞాన ప్రకాష్ స్వామిజీ, మాజీ ఎంపి హర్షకుమార్, మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్, శివరాం, బసవ లింగమూర్తి స్వామిజీ విచ్చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టరన రమేష్, జయరామప్ప, మధు, శ్రీనివాస్, గంగాధర్, మూర్తి, బాలు, శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెవైఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి

గుంతకల్లు టౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త


తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న బిజెవైఎం నాయకులు

రేషన్ పంపిణీ వాహనాలపై ప్రధాని నరేంద్రమోడి ఫోటో ఏర్పాటు చేయాలని శనివారం తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డికి బిజెవైఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు. అనంతరం బిజెవైఎం జిల్లా కార్యదర్శి మొండ్ల కేశవ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాయితీ ఇస్తున్న రేషన్ సరుకులపై రాష్ట్ర ప్రభుత్వం తమ ఫోటోలు వేసుకుంటూ అజమాయిషీ చెలాయిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9 వేల రేషన్ వాహనాలకు కేంద్ర ప్రభుత్వం రాయితీ మంజూరు చేసిందని గుర్తు చేశారు. కరోనా సమయంలో కూడా పేదవారికి 5 కిలోల ఉచిత రేషన్ పంపిణీ చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఏటా దాదాపు 6 వేల కోట్లతో 17 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను 60 శాతం క ంటే ఎక్కువ మంది ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రేషన్ పంపిణీ వాహనాలపై ప్రధాని నరేంద్రమోడి ఫోటో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం పట్టణ కార్యదర్శి రవితేజ, ఉపాధ్యక్షులు రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గుడిబండ, నవంబర్ 18 ప్రభాతవార్త


విద్యార్థులతో మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి

మండల కేంద్రంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారి కేకెరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వక్తృవ, వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం తదితర క్రీడల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పోటీలకు దాదాపు 20 మంది ఉ పాధ్యాయినీ ఉపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈపోటీలలో దాదాపు 300 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనానరు. ఈ పోటీలలోని విజేతలకు గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఈ నెల 20వ తేదిన బహుమతులు ప్రధానం చేయనున్నట్లు గ్రంథాలయ అధికారి కమలనాభరావు తెలిపారు.

# గ్రంథాలయాలకు, క్రీడలకు అవినాభావ సంబంధం

తాడిమర్రి, నవంబర్ 18 ప్రభాతవార్త


విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రంథాలయాలకు, క్రీడలకు మంచి అవినాభావ సంబంధం ఉందని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ పేర్కొన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం క్రీడా పోటీలను హైస్కూల్‌లో నిర్వహించారు. గ్రంథాలయ అధికారి శీనా నాయక్ ఆధ్వర్యంలో యువతకు పలు రకాల పోటీలను నిర్వహించారు. వాలీబాల్, దేశ నాయకుల చరిత్ర, గ్రంథాలయాల అభివృద్ధిపై వ్యాసరచన తదితర ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థుల జాబితాను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చివరి రోజున గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా ఎక్కడ చేస్తున్నారో చెప్పండి..!

**- విద్యుత్‌శాఖ అధికారులను నిలదీసిన వైకాపా నెరమెట్ల సర్పంచ్ బి.యోగేంద్రరెడ్డి - పక్షం రోజులకు ఒకసారి నీరివ్వడమేంటి పీఏసీఎస్ ఛైర్మెన్ వడ్ల శేక్షావలి - శేక్షానుపల్లి పంచాయతీలోని 5 చెరువులకు నీరివ్వాలని కోరిన సర్పంచ్ లింగన్న - అధికారులు సమయానికి రాక 9 గంటలకు ప్రారంభం కావాల్సి సమావేశం 11కు ప్రారంభం - కలెక్టర్‌కు నివేదిస్తామన్న ఎంపీపీ యం.నరసింహులు, ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్**




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యం.నరసింహులు, వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరాపై ప్రశ్నిస్తున్న అధికార పార్టీకు చెందిన నెరమెట్ల గ్రామ సర్పంచ్ బి.యోగేంద్రరెడ్డి, చెరువులకు నీటిని అందించాలని కోరుతున్న శేక్షానుపల్లి గ్రామ అధికార పార్టీ సర్పంచ్ లింగన్న

ఉరవకొండ, నవంబర్ 18 ప్రభాతవార్త

ప్రభుత్వమేమో వ్యవసాయానికి 9 గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతోందని అయితే వాస్తవానికి కనీసం 5 గంటలు కూడా విద్యుత్ సరఫరా కావడంలేదని దీంతో పంటలకు నీరుపెట్టుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల పరిధిలోని నెరమెట్ల గ్రామానికి చెందిన అధికార వైకాపా సర్పంచ్ బి.యోగేంద్రరెడ్డి వాపోయారు. పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ యం.నరసింహులు అధ్యక్షతన, ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరుగగా జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ జి.హరిప్రసాద్ హాజరయ్యారు. అధికారులరాక ఆలస్యం కారణంగా ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 11 గంటల తరువాత ప్రార ంభంకాగా ప్రజాప్రతినిధులు సమస్యలను ఏకరవు పెట్టారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా విషయమై విద్యుత్ ఏఈ గురుమూర్తి మాట్లాడుతూ కొన్ని ఫీడర్లలో సమస్యల కారణంగా 5 గంటలపాటు విద్యుత్ ఇస్తున్నామని సమస్యలను పరిష్కరించి అన్ని ఫీడర్లకు ఇస్తున్న తరహాలోనే 7 గంటలు విద్యుత్ ఇస్తామన్నారు. శేక్షానుపల్లి సర్పంచ్ లింగన్న మాట్లాడుతూ మా పంచాయతీలోని 5 చెరువులకు నీరివ్వాలని నీరులేని కారణంగా బోర్లన్నీ ఎండిపోయి తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వివిధ ప్రాంతాల్లో 5 బోర్లు వేయించకుంటే వచ్చే వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి తప్పదన్నారు. దీంతో స్పందించిన ఎంపీపీ యం.నరసింహులు మండల పరిషత్ ద్వారా వెంటనే వేయిస్తామని ప్రకటించారు. పెద్దకొకుంట్ల తేదేపా ఎంపీటీసీ కురుబ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలోని పీహెచ్‌సీలో వైద్యులే అందుబాటులో ఉండటంలేదని నాడిపట్టి రోగులను పరీక్షించేవారు కరువయ్యారని అన్నారు. ఎఫ్‌పీ షాపులకు ఎంఎల్ఎస్ పాయింట్ నుండి ఇచ్చే బియ్యం తూకం తక్కువగా వస్తోందని దీంతో ఎఫ్‌పీ షాపు డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.తేజోనాథ్ కోరారు. రేణిమాకుపల్లి సర్పంచ్ బోయ రామాంజినేయులు మాట్లాడుతూ మాగ్రామానికి ఎండీయూ వాహనం రావడంలేదని ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఎంపీటీసీ వన్నూరుసాబ్ మాట్లాడుతూ రేషన్ పంపిణీ అస్తవ్యస్థంగా ఉందన్నారు. దీంతో స్పందించిన సీఎస్‌డీటీ కంబక్క మాట్లాడుతూ తాను కొత్తగా వచ్చానని ఎఫ్‌పీ షాపు డీలర్లు, ఎండీయూ వాహనదారులు సమన్వయంతో పనిచేసేలా చూస్తామన్నారు. పట్టణంలో 10నుంచి 15రోజులకు ఒకసారినీటిని సరఫరా చేస్తున్నారని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పీఏసీఎస్ ఛైర్మెన్ వడ్ల శేక్షావలి వాపోయారు. రాయంపల్లి జగనన్న లేఅవుట్‌లో, పట్టణంలోని అంబేద్కర్‌నగర్ చివరల్లో నీటి సమస్య అధికంగాఉందని జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ సమావేశం దృష్టికితెచ్చారు. పాత పైప్‌లైన్లకు నీటి సరఫరా సరిగ్గా జరుగడంలేదని ఒక కుళాయికు నీరొస్తే పది కుళాయిలకు రావడంలేదని ఎంపీటీసీ ఈడిగ ప్రసాద్‌గౌడ్ వాపోయారు. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫమీదా మాట్లాడుతూ హెచ్ఎల్‌సీ కాలువకు 7 నెలల పాటు రావాల్సిన నీరు ఈనెల 20 నుండి బంద్ అవుతుండటంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడినమాట వాస్తవమన్నారు. నింబగల్లు సీపీడబ్ల్యూ స్కీమ్‌లో మూడు ఎస్ఎస్ ట్యాంకులు ఉండగా రెండింటినీ పూర్తీ సామర్థ్యంతో నింపామని ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉదిరిపికొండ నుండి ఉరవకొండ వరకు 19 కిలోమీటర్ల ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటుకు టెండర్లు పూర్తీ అయ్యాయని అగ్రిమెంట్ కాగానే పనులు ప్రారంభమవుతాయని అందులో 400 కేఎల్ సంప్ కూడా నిర్మించడం జరుగుతుందన్నారు. ఆమిద్యాల ఎంపీటీసీ ఓబయ్య మాట్లాడుతూ ఆమిద్యాలలో విద్యుత్ పోళ్లు కొన్ని కూలడానికి సిద్ధంగా ఉన్నాయని ప్రమాదం జరుగకముందే సర్పంచాలని కోరారు. గ్రామంలో 2 సచివాలయాలు ఉన్నా సిబ్బంది లేరని ప్రజలకు సేవలు అందడంలేదన్నారు. ఏఓ శుభకర్ మాట్లాడుతూ నకిలీ పురుగుల మందుల విక్రయాలపై కొరడా ఝులిపించడం జరిగిందని ఇప్పటికే ఒక దుకాణంలో 1.7 మందులు సీజ్‌చేసి షోకాజ్ నోటీసు ఇచ్చి మందులు ల్యాబ్‌కు పంపామని అవి నకిలీవని తేలితే లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మండల ఇంజనీర్ మధుసూదన్‌రావు, హౌసింగ్ ఏఈ హర్ష, వైకేపీ ఏపీఎం శివయ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ విమల, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రగతి నివేదికలు ఇవ్వరు, సమయ పాలన పాటించరు :** మండల సర్వసభ్య సమావేశానికి వారం రోజులకు ముందే వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు ఇవ్వాలన్నా ఇవ్వకపోగా సమావేశానికి సమయానికి హాజరుకావడంలేదని మండల సమావేశాలంటే కొందరిలో చులకన భావం ఉందని ఎంపీపీ యం.నరసింహులు, ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ అసహనం వ్యక్తం చేశారు. ఇక ఉపేక్షించమని సమయ పాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్, ఆయా శాఖల ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. ఉరవకొండ సీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ఎవరూ హాజరుకాకపోవడం, కౌకుంట్ల పీహెచ్‌సీ నుండి సూపర్‌వైజర్ మాత్రమే రావడంపై ఆయా శాఖలకు నివేదిక పంపుతామన్నారు. మండల పరిషత్ కార్యాలయం మరమ్మతులు త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని ప్రకటించారు.

# భాషతో పాటు సంస్కృతిని పెంపొందించుకోవాలి

పావిగడ, నవంబర్ 18 ప్రభాతవార్త


సమావేశంలో మాట్లాడుతున్న అజయ్ నాగేష్

తమ మాతృభాషతోపాటు సంస్కృతిని కూడా పెంపొందించుకోవాలని సరిహద్దు గ్రామాలలోని ప్రజలు తమ ఇళ్లల్లో కూడా కన్నడ భాషలోనే మాట్లాడాలని జ్ఞానవాహిని సంస్థ కార్యదర్శి అజయ్ నాగేష్ పేర్కొన్నారు. శనివారం జ్ఞాన వాహిని పాఠశాలలో కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవ మాసాచారణ సందర్భంగా విశేష కన్నడ జాగృతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సరిహద్దు గ్రామాల్లో మాతృ భాష అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ కన్నడ భాషలోనే మాట్లాడాలని కన్నడ భాష ప్రేమికులు కావాలని కోరారు. తమ ఇళ్లల్లో కూడా కన్నడ భాషలోనే మాట్లాడాలన్నారు. ఆంగ్ల భాషలో చదివినప్పటికీని కన్నడ భాషను మరవకూడదన్నారు. కన్నడ భాష ఉపాధ్యాయులు సంఘ సంస్థలు కలిసి కన్నడ భాష అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తాలూకా సాహిత్య పరిషత్ అధ్యక్షులు కట్టా నరసింహామూర్తి మాట్లాడుతూ.. సరిహద్దు పావగడ తాలూకాలో 103 పాఠశాలలు కళాశాలలో విద్యార్థులకు కన్నడ జాగృతిని పెంపొందించే కార్యక్రమాన్ని కన్నడ సాహిత్య పరిషత్ చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవిచంద్ర, ఆ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రామాపురంలో మొక్కలు పంపిణీ

తాడిమర్రి, నవంబర్ 18 ప్రభాతవార్త

రాబోవు తరాల వారికి సకాలంలో వర్షాలు కురిసి పంటలు సశ్యస్యామలం కావడానికి మొక్కలు పెంపకం దహదం చేస్తాయని రామాపురం సర్పంచు రామ్మోహన్ అన్నారు. పరిటాల ర వీ ంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరిటాల శ్రీరామ్ పంపిన మొక్కలను మండల టీడీపీ కన్వీనర్ కూచి రాము సర్పంచుకు అందజేశారు. ఈ సందర్భంగా మొక్కలన్నింటినీ ప్రజలకు అందజేశారు. అనంతరం చిల్లకొండాయపల్లి, కునుకుంట్ల, మోదుగులకుంట్ల తదతర గ్రామల్లో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కొనెదల సాయి, శివపల్లి హరినాథ్, రవీంద్రరెడ్డి, పక్కీరారెడ్డి, పాపానాయుడు, సాంబ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

07ATP18_07ATP18.qxd 18-11-2023 PM 11:03 Page 1



## మెరుగైన వైద్యం అందించడమే వైసిపి ధ్యేయం

**-ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి**



వైద్యపరీక్షలు చేయించు కుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

తాడిపత్రిఅర్బన్, నవంబర్ 18 ప్రభాతవార్త

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన పట్టణంలోని నూతన కూరగాయల మార్కెట్ వద్ద వున్న డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆయన ఆరా తీశారు. ప్రజలకు మెరుగై వైద్య సేవలు అందించాలని ఆయన డాక్టర్లు, సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన వైద్యపరీక్షలు చేయించు కున్నారు. ఈ కార్య క్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గెలుపే ధ్యేయంగా ముందుకు సాగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెసి అస్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, నవంబర్ 18 ప్రభాతవార్త

2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని ఆ పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని టిటిడి కళ్యాణ మండపంలో శనివారం పెద్దవడుగూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జె.సి అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న విధి విధానాలను తెలియచేశారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి ప్రజలకు తెలియచేయాలన్నారు. మనం చేసే మంచి గురించి ప్రజలకు తెలియపరచాలన్నారు. అదేవిధంగా జె.సి ప్రభాకర్‌రెడ్డి చేసిన అభివృద్ధి గురించి ప్రతి కార్యకర్త ప్రజలకు తెలియజేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జె.సి అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రంథాలయ వారోత్సవాల్లో వివిధ కార్యక్రమాలు



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి, నవంబర్ 18 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో శనివారం 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి మధుసూదన్ తెలిపారు. ఇందులో భాగంగా యాడికి ప్రాథమిక పాఠశాల నెంబర్-3, ప్యారడైజ్ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెంబర్-3 పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీలబాయ్, ఉపాధ్యాయులు నబిరసూల్, జయరామ్‌రెడ్డి, సుందర్, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లు పట్టివేత

యాడికి, నవంబర్ 18 ప్రభాతవార్త



పట్టుకున్న టిప్పర్

తాడిపత్రి సమీపంలోని పెన్నానది నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను శనివారం మండలంలోని వేములపాడు వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ రెండు వాహనాలను భూగర్భ గనులశాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

## పంటనష్టనమోదు ప్రక్రియ ప్రారంభం

యాడికి, నవంబర్ 18 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత ం యాడికి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడం, వర్షాధార పంటలకు పంట నష్ట అంచనా వేయమని ప్రభుత్వం నుండి ఆదేశాలు అందినట్లు శనివారం వ్యవసాయ అధికారి మహబూబ్‌బాష తెలిపారు. జిల్లా కలెక్టర్ దేశాలమేరకు ఈ నెల 18 నుండి 20వతేదీ వరకు పంట నష్టం అంచనా వేయడం జరుగుతుందన్నారు. ఇందుకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఇందులో సభ్యులుగా గ్రామ వ్యవసాయ అధికారి, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్, మండల కమిటీలో మండల వ్యవసాయాధికారి, తహశీల్దార్ కమిటీ సభ్యులుగా వుంటారని ఎఒ తెలిపారు. ఈ కమిటీల ద్వారా పంట నష్టం అంచనా వేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 21 నుండి 25 వరకు పంట నష్టం జరిగిన రైతుల వివరాలు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కొరకు వుంచడం జరుగుతుందన్నారు. ఏవైనా తప్పులు వుంటే రైతులు ఈ నెల 21 నుండి 25లోపు ఇవ్వాలని, ఈ నెల 27వతేదీన తుది జాబితాను జిల్లా కార్యాలయానికి పంపనున్నట్లు రైతులు తమ ఆధార్, 1బి, బ్యాంకు అకౌంట్ వివరాలు ఇప్పటికే తమ తమ రైతు భరోసా కేంద్రాల్లో ఇచ్చి వున్నారని ఎవరైనా ఇవ్వకపోతే సోమవారం వరకు గడువు వుందని ఆయన తెలిపారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, నవంబర్ 18 ప్రభాతవార్త

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని తాడిపత్రి గ్రంథాలయం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రవికుమార్‌నాయుడు మాట్లాడుతూ ఇలాంటి పోటీల వల్ల విద్యార్థులకు చిన్న తనం నుండే పోటీతత్వం అలవడుతుందన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 20వతేదీన బహుమతులు అందచేయడం జరుగుతుందని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగయ్య, ఉపాధ్యాయులు రామ్మోహన్‌రెడ్డి, అనిల్‌కుమార్, విద్యార్థినీ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## నిశ్చితార్థ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే సతీమణి

యల్లనూరు, నవంబర్ 18 ప్రభాతవార్త



కాబోయే నూతన వధూవరులతో ఎమ్మెల్యే సతీమణి రమాదేవి

మండలంలోని తిమ్మంపల్లిలో శనివారం జరిగిన వివాహ నిశ్చితార్థ వేడుకకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి, ఆయన కుమారుడు కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియచేశారు.

## కుటుంబసభ్యులను పరామర్శించిన హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రిరూరల్, నవంబర్ 18 ప్రభాతవార్త



నివాళులు అర్పిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

మండలంలోని చుక్కలూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు భాస్కర్ తండ్రి కనకరాజు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న యువనాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని కనకరాజు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

## పలు వేడుకలకు హాజరైన రమేష్‌రెడ్డి



వేడుకలో పాల్గొన్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిఅర్బన్, నవంబర్ 18 ప్రభాతవార్త

పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల్లో శనివారం జరిగిన పలు వేడుకలకు వైకాపా రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా పట్టణ సమీపంలోని శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద నందీశ్వరుని నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా కడప జిల్లా ఆర్ఎస్ కొండాపురం మండలం కోడూరు గ్రామంలో జరిగిన శ్రీచెన్నకేశస్వామి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

## టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



డిఇఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపిటిఎఫ్ నేతలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త

బదిలీ అయిన ఉపాధ్యాయులను వారివారి పాఠశాలల్లో జాయిన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం డీఈఓ వి.నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది మేలో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో బదిలీలు జరిగి అన్ని సబ్జెక్టుల పాఠశాల సహాయకులు బదిలీలు పొంది రిలీవ్ కాబడి వారివారి నూతన పాఠశాలల్లో చేరి వారి విధులను కొనసాగిస్తున్నారన్నారు. అయితే జిల్లాలో ఆంగ్ల పాఠశాల సహాయకులు మాత్రం దాదాపు 100 మందికిపైగాప్రత్యామ్నాయం లేక రిలీవ్ కాకుండా పాత పాఠశాలల్లోనే కొనసాగే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో వాళ్లంతా తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతూ.. తమ విధులను ప్రశాంతంగా సమర్ధవంతంగా నిర్వహించలేకపోతున్నారన్నారు. కావున తమరు దయవుంచి వెంటనే వీరందరిని రిలీవ్ చేసి వారు బదిలీ పొందిన నూతన పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## తల్లి, పిల్లల మరణ ప్రమాణశాతం తగ్గించేందుకు ప్రామాణిక ప్రయత్నం చేయండి

**- జిల్లా ఆరోగ్య అభియాన్ సభలో వైద్యసిబ్బందికి జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా సూచన**



జిల్లా ఆరోగ్య అభియాన్‌లో మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌మిశ్రా

బళ్లారి, నవంబర్18, ప్రభాతవార్త; జిల్లాలో ఆస్పత్రులకు వచ్చే గర్భిణీ మహిళలకు తగు పరీక్షలు నిర్వహించి, సమయానికి అనుగుణంగా టీకాలు వేయాలని, తల్లి, శిశు మరణాల ప్రమాణశాతం తగ్గించేందుకు ప్రామాణిక ప్రయత్నం చేయాలని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్‌మిశ్రా వైద్యాధికారులకు సూచించారు. జిల్లాధికారి కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఆరోగ్య అభియాన్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రసవానంతరం వివిధ సమస్యలతో తల్లులు మరణించడం జరుగుతున్నది, వారిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉన్నదని, ఇందుకోసం ముందు జాగ్రత్తగా గ్రామాల్లో ఆరోగ్యశాఖ వైద్యసిబ్బంది విస్తృతంగా ప్రచారం చేపట్టాలని, అనవసర గర్భస్రావాలు జరగకుండా అలాగే ఉండేలా ముందు జాగ్రత్త చర్యగా గర్భిణీ మహిళలకు తగు పౌష్టికాహారం తీసుకునేవిధంగా ఒప్పించి తగిన రీతిలో ఔషధాలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. అలాగే ఎప్పటికప్పుడు తగు రక్త పరీక్షలు నిర్వహించి, వారికి వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి తల్లితోపాటు గర్భంలో ఉన్న శిశువులను కాపాడేదిశలో చర్యలు తీసుకోవాలని, జిల్లా ప్రభుత్వాస్పత్రి, ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవం కోసం వచ్చే గర్భిణీలకు వెనువెంటనే పడకలు కేటాయించి, సుఖ ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రసవానంతరం బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యత గురించి జాగృతి కల్పించే కార్యం చేపట్టాలని ఆశా కార్యకర్తలు బాలింతల పట్ల శ్రద్ధ వహించాలని, దీని వల్ల శిశు మరణాలు తగ్గే అవకాశం ఉన్నదన్నారు. సభలో డీహెచ్ఓ డాక్టర్ వై.రమేష్‌బాబు జిల్లాలో జరిగిన తల్లి, పిల్లల మరణ వివరాలను సభకు తెలిపారు. జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి, ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ పూర్ణిమ, జిల్లా క్షయరోగ నిర్మూలనాధికారి డాక్టర్ ఇంద్రాణి, వివిధ విభాగాల వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లూరమ్మతల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**- రూ 2 లక్షలు విరాళం ఇచ్చిన మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి**



చెక్కును అందచేస్తున్న మాజీ సర్పంచ్

ఓబుళదేవరచెరువు, నవంబర్ 18, ప్రభాతవార్త

మహిమాణ్వితా గ్రామ దేవత మల్లూరమ్మతల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఇనగళూరు గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్ పెద్దసాని రామచంద్రారెడ్డి గ్రామ దేవతను మొక్కారు. మండలంలోని వెంకటాపురం పంచాయితీ నారప్పగారిపల్లి సమీపంలోని సోమావతినది యేటి ఒడ్డున కొలువైన ఉన్న మల్లూరమ్మ తల్లి ఆలయంలో శనివారం రామచంద్రారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లూరమ్మ దేవత విశిష్టతను ఇనుమడింప చేసేందుకు ఆలయ అభివృద్ధికి తన వంతు విరాళంగా రూ 2 లక్షల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందచేసినట్లు మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ విరాళాన్ని ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అన్నదాన సత్రం, ఇతర పనులకు వినియోగించాలని అన్నారు. అనంతరం దాత రామచంద్రారెడ్డికి శాలువ, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ శంకర్‌రెడ్డి, మామిళ్లకుంట్లపల్లి సర్పంచ్ తొట్లి రంగారెడ్డి, కమిటీ సభ్యులు రమణారెడ్డి, శివారెడ్డి, రాజారెడ్డి, లక్ష్మీ క్రపతిరెడ్డి, గోవిందరెడ్డి, కనేకంటి చెన్నారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 5వ రోజు అనంతపురం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమ ఆధ్వర్యంలో ఐదవ రోజు ఉదయం 10 గంటలకు రమేష్ నారాయణ, ఆర్‌డిటి ప్రిన్సిపాల్ రచించిన వివిధ రకాల పుస్తకాలను సుమారు 300 అ ధ్యక్షులు, కార్యదర్శిల వారికి ఉచితంగా ఇవ్వడం జరిగింది. సాయంత్రం 6 గంటలకు గ్రంథాలయ అభివృద్ధి, డిజిటల్ గ్రంథాలయాలు అను అంశం మీద కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి కొగటం విజయభాస్కర్‌రెడ్డి డిప్యూటీ మేయర్ పాల్గొన్నారు కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఎల్ఎం.మోహన్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ డి.గోవిందరాజులు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్యలో నాసా కిట్స్ అందజేత



నాసా కిట్లను చూపుతన్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త

స్థానిక కక్కలపల్లి కాలనీలో ఉన్న శ్రీ చైతన్య బాలుర రెసిడెన్షియల్ బ్రాంచ్-3లో నాసా కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యరకమానికి ముఖ్య అతిథిగా అనంతపురం జిల్లా పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శ్రీ చైతన్య విద్యార్థులు నాసా వారికి ప్రాజెక్ట్స్ పంపించడం జరుగుతుంది. విద్యార్థుల ఉత్సాహాన్ని గుర్తించిన నాసా-అమెరికా వారు 90 మంది విద్యార్థులకు టీషర్ట్స్, బుక్, బ్యాడ్జ్‌ను పంపించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు విశ్వంపై పరిశోధనలు చేయడానికి చేసే కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వెంకటేష్, ఖలందర్, కోఆర్డినేటర్ నాగభూషణం, డాన్ చిరంజీవి, నాసా ఇన్‌చార్జ్‌లు మకరజ్యోతి, శివలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జగన్‌మోహన్‌రెడ్డి సింహం కాదు..

**ఘాటు వ్యాఖ్యలు చేసిన రమణారెడ్డి**



బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో రమణారెడ్డి

అనంతపురం అర్బన్, నవంబర్ 18 ప్రభాతవార్త

బాబుషూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా అనంతపురం నగరంలోని సరిపూటి ర మణ ఆధ్వర్యంలో సాయినగర్ 28న డివిజన్‌లో పాల్గొన్న టిడిపి శ్రేణులు.. ప్రతి ఇంటికి తిరుగుతూ భవిష్యత్తుకు బాబు ఇచ్చిన గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి మరొక అవకాశం ఇవ్వకండి అంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ క్లస్టర్ ఇన్‌చార్జ్ సరిపూటి రమణ, ఎస్టీ సెల్ నగర అధ్యక్షులు, యూనిట్ ఇన్‌చార్జ్ మనోహర్, ఎన్‌బికె నారాయణస్వామి, సరిపూటి శ్రీకాంత్, నాగరాజు, నాయుడు, ఈడిగ మారుతి గౌడ్, గుండప్ప, బోయ వెంకటప్ప, తహీర్, గిరి, బోయ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ టీంకు మోక్షిత్ స్కూల్ విద్యార్థులు శుభాకాంక్షలు

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 18 ప్రభాతవార్త

ఐసిసి వరల్డ్ కప్-2023లో భాగంగా వరుసగా 10 విజయాలతో ఫైనల్స్‌కు దూసుకెళ్లిన టీం ఇండియా కప్ గెలవాలని ఆకాంక్షిస్తూ మోక్షిత్ స్కూల్ విద్యార్థులు తమ విషెస్‌ను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి అధ్యక్షత వహిస్తూ ఇప్పటి వరకు ఇండియన్ టీం ప్రదర్శన టోర్నమెంట్ మొత్తం అద్భుతంగా ఉందని అలాగే ప్రతి భారతీయుడు వరల్డ్ గెలవాలని కోరుకోవాలని, విద్యార్థులలో దేశం పట్ల స్ఫూర్తిని నింపారు. ప్రతి విద్యార్థి తమ అభిమాన క్రికెట్ బాగా ఆడాలని కోరుకోవాలని, తద్వారా ఇండియన్ టీం వరల్డ్ విజేతగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ మిని స్ట్రెస్ వై.లక్ష్మి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే డా.పివి.సిద్దారెడ్డి

కదిరి, నవంబర్ 18 ప్రభాతవార్త

తలుపుల మండల పరిధిలోని బత్రేపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలుపులకు చెందిన రెడ్డి భాషా మృతి చెందాడు. విషయం తెలుసకున్న ఎమ్మెల్యే పివి.సిద్దారెడ్డి శనివారం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సహాయంగా తక్షణమే 10వేలు అందించారు. ఎమ్మెల్యే వెంట వైకాపా నాయకులు ఉన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్దారెడ్డి

కదిరి, నవంబర్ 18 ప్రభాతవార్త

పట్టణంలోని రైస్ మిల్ ఓనర్ వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వైద్య చికిత్సల అనందరం ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి శనివారం వారి ఇంటికి వె ళ్లి పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట వైకాపా నాయకులు తదితరులు ఉన్నారు.

## గ్రంధాలయ వ్యాసరచన, క్రీడా పోటీలు

తనకల్లు, నవంబర్ 18, ప్రభాతవార్త



వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహిస్తున్న గ్రంధాలయ అధికారి మస్తాన్‌వలి

56వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని గ్రంధాలయంలో గ్రంధాలయ అధికారి మస్తాన్‌వలి కెజిబివి, యంపియూపి(ఉర్దూ) పాఠశాల నందు వ్యాసరచన, వకృత్య, చిత్రలేఖనం, క్విజ్, క్రీడ మొదలగు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యంపియూపి (ఉర్దూ) స్కూల్ ఉపాధ్యాయుడు అలీ మాట్లాడుతూ ఈ పోటీలు నిర్వహించడం వలన విద్యార్థులకు పోటీ తత్వం అలవడుతుందని, విధ్యార్థులు సైతం అలాంటి పోటీలలో పాల్గొంటే వారికి పలు అంశాలపై మరింత అవగాహన పెరుగుతుందని, బాల్యదశ నుండి విధ్యార్థులు ఇలాంటి పోటీలలో పాల్గొనడానికి ఆసక్తి చూపాలన్నారు. కావున ఇలాంటి పోటీలలో పాల్గొని వారి మెధోసంపత్తిని పెంపొందించుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయ ఉపాధ్యాయనీలు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రంధాలయ పాఠకులు పాల్గొన్నారు.

## టిడిపి పార్టీ నాయకుడి తల్లి మృతి

తనకల్లు, నవంబర్ 18, ప్రభాతవార్త



పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కందికుంట

మండల పరిధిలోని బొంతల పల్లి పంచాయతీ పూలకుంట పల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ఉతన్న తల్లి మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న తెలుగు దేశం పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్ ఉతన్న తల్లి పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. కంది కుంటతో పాటు మాజీ జెడ్పిటిసి రవీ ంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, నాగమల్లు, సీనియర్ నాయకులు యంవి. సిద్దారెడ్డి, సత్యం, ఎస్. సిద్దారెడ్డి, మైనార్టీ నాయకులు హర్షాద్‌ఖాన్, తాజుఖాన్, ఆనంద, ఆదిరెడ్డి, బూత్ ఇన్‌చార్జ్‌లు వెంకటరెడ్డి, ఎస్. రామప్ప, మౌలాఖాన్, మాజీసర్పంచ్ కిష్టప్ప, ఖాదర్‌సాబ్, వినోద్,వెంకటేష్ తదితరులు టిడిపి నాయకులు ఉత్తన్న తల్లి పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## తెలంగాణ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి



తెలంగాణ రాష్ట్రంలోని కొల్లాపూర అసెంబ్లీ క్షేత్రం కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి క్రిష్ణారావు పరంగా ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి, నవంబర్18, ప్రభాతవార్త

ఈనెల 30వ తేదీన జరిగే తెలంగాణ రాష్ట్రం ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులపరంగా ప్రచారానికి కర్ణాటక రాష్ట్రం నుంచి కాంగ్రెస్ ప్రముఖులు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు రంగంలోకి దిగారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బి.నాగేంద్ర ఇప్పటికే తెలంగాణ చేరుకొని రెండు, మూడు జిల్లాల్లో ఆయా అసెంబ్లీ క్షేత్రాల్లో కాంగ్రెస్ అభ్యర్థులపరంగా విస్తృత ప్రచారం చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సైతం శనివారంనాడు తెలంగాణలోని కొల్లాపుర అసెంబ్లీ క్షేత్రం కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు పరంగా ప్రచారం చేపట్టి ఓటర్లను అభ్యర్థించారు.

సదరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ స్పష్టమైన తెలుగుభాషలో మాట్లాడుతూ ఓటర్లను ఎంతగానో ఆకట్టుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంలో బళ్లారి జిల్లా కాంగ్రెస్‌సమితి కార్యాధ్యక్షుడు బోయపాటి విష్ణు, యువనాయకులు పి.జగన్నాథ్ తదితరులు ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి వెంట ఉండి ఎన్నికల ప్రచారంలో పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థిపరంగా ఓట్లు అభ్యర్థించారు.

